ఓటుతోనే ఉజ్వల భవిత

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- పలు ప్రాంతాల్లో ర్యాలీలు.. అవగాహన కార్యక్రమాలు
- ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలి
- రాజేంద్రనగర్ ఆర్డీఓ, ఈఆర్ఓ వెంకట్‌రెడ్డి

రాజేంద్రనగర్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేంద్రనగర్ ఆర్డీఓ, ఈఆర్ఓ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 25ను జాతీయ ఓటరు దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ఓటును సద్వినియోగం చేసుకుంటేనే దేశానికి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందన్నారు. తహసీల్దార్, ఏఆర్ఓ బొమ్మ రాములు మాట్లాడుతూ... ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, క్రాంతికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు

అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి: రాజేంద్రనగర్ డీసీ రవికుమార్

జాతీయ ఓటర్ల దినోవాన్ని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉప కమిషనర్ రవి కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీసీ రవికుమార్, సిబ్బంది

హైదర్షాకోట్ పాఠశాలలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. హైదర్షాకోట్‌లోని ప్రాథమిక పాఠశాలలో ప్రతిజ్ఞ చేయించి సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. బీఎల్‌వోలు నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, లత, వరలక్ష్మి, స్వాతి, స్వర్ణలత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హైదర్షాకోట్ పాఠశాలలో సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నేడు మల్లన్న కల్యాణోత్సవం

మణికొండ: పుప్పాలగూడలో వెలసిన మల్లన్న స్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడు సురేష్ కురుమ, ఉపాధ్యక్షుడు మహేశ్ కురుమ, మండల ఉపాధ్యక్షుడు గుట్టమీది నరేందర్, కమిటీ సభ్యుడు జి.విఠల్ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం 8 గంటలకు గ్రామం నుంచి గంపలతో దేవాలయానికి చేరుకోవటం, మధ్యాహ్నం 12.30కు మల్లన్నభ్రమరాంబికల కల్యాణం ఉంటాయన్నారు. అనంతరం అగ్నిగుండాలు తొక్కటం, సాయంత్రం మల్లన్న బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు. సోమవారం ఉదయం 10 గంటలకు నాగవెల్లి, మధ్యాహ్నం 12 గంటలకు చిద్రుప్ప ఒగ్గు కృష్ణ బృందంతో ఒగ్గు కథ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున బోనాలను స్వామి వారికి సమర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంబికా ఫుడ్స్, రాజా అగ్రో ప్రాంతం, కాటేదాన్ పారిశ్రామికవాడలో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు కల్పనా మెటల్స్, విశ్వకర్మ ఇండస్ట్రీ, బసప్ప హోటల్, హనుమాన్ దేవాలయం ప్రాంతంలో విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు దిశాఫుడ్స్ ప్రాంతం, అంబికా ఫుడ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఏసియన్ బ్యారెల్స్, ఐఎంటీ గోడౌన్స్, హర్ష బేకర్స్ యూనిట్ 1, 2 నీతూ మెటల్ కంపెనీ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోటి కంపెనీ, ఇందు ఆయిల్ మిల్, డేటెడ్ మెటల్ కేన్స్, కేడి ఆగ్రో ఏరియా, ఓస్వాల్ రబ్బర్ కంపెనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గంగోత్రి విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన పారిశ్రామికవాడ, గణేష్‌నగర్, అమ్మ గార్డెన్స్ పయనీర్ స్కూల్, బాబా టెంట్‌హౌస్, షమా టెంట్‌హౌస్ ప్రాంతాలలో విద్యుత సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

శంషాబాద్ డీసీపీ రాజేశ్


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ రాజేశ్

మణికొండ: ఉరుకుల పరుగుల జీవన విధానంలో ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. శనివారం మణికొండ మున్సిపల్ పరిధిలో లక్ష్మీప్రియ కాలనీలో డాక్టర్ ప్రభు లైఫ్ మల్టీస్పెషాలిటీ క్లినిక్స్, నర్సింగ్ హోంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రభు మాట్లాడుతూ... పలు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి, డాక్టర్ ఇమ్రాన్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

అత్తాపూర్: నిషేధిత పాన్ మసాలా, గుట్కాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలిసి అత్తాపూర్ చింతల్‌మెంట్ ఎం.ఎం.పహాడి ఇతర ప్రాంతాల్లో ఉన్న పాన్ మసాలా డబ్బాలలో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గుట్కాలు, పాన్ మసాలాలు, గంజాయి సిగరెట్లు, గంజాయి చాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐలు చైతన్య, రషీద్, మియా పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు చేశారు. మత్తు పదార్థాలు, నిషేధిత గుట్కా వస్తువులను విక్రయించే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... ఆ సమాచారాన్ని అత్తాపూర్ పోలీసులకు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి (45) మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు... గణేష్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల గోడ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు శనివారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు భిక్షాటన చేస్తూ ఉండేవాడని, నల్ల షర్ట్, ప్యాంట్ ధరించాడు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31న కేసీఆర్ క్రికెట్ టోర్నీ

మణికొండ: మున్సిపాలిటీ స్థాయిలో ఈ నెల 31వ తేదీన కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఔత్సాహిక టీమ్‌లు తమ పేర్లను ఈ నెల 28వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 75 వేలు, రెండవ స్థానం రూ. 50 వేలు, మూడవ స్థానం జట్టుకు రూ. 25 వేల నగదును ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామన్నారు. టీమ్‌ల షెడ్యూల్, క్రీడా ప్రాంగణంను ఈ నెల 29వ తేదీన ప్రకటిస్తామన్నారు. వివరాలకు ఫోన్స్: 97038 99933, 83092 69046లలో సంప్రదించాలని సూచించారు.

మరింత విస్తరిస్తున్న సినీ పరిశ్రమ

- ప్రభుత్వ పరంగా సహకరిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మణికొండ: తెలుగు సినీ పరిశ్రమ మరింత విస్తరిస్తున్నదని... అందుకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మణికొండ హనుమాన్‌నగర్ కాలనీలో రమేష్ సినీ డబ్బింగ్, మిక్సింగ్ స్టుడియోను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ... సినీ పరిశ్రమ అభివృద్ధికి ఇలాంటి స్టుడియోలు మరిన్ని రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, కౌన్సిలర్‌లు బి.కావ్యశ్రీరాములు, కె.రామకృష్ణారెడ్డి, కె.లక్ష్మీనారాయణ, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు యాలాల నరేష్, బి.శ్రీరాములు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


స్టుడియో ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి వెంకట్‌రెడ్డి తదితరులు

4 నుంచి సీబీఐటీలో ‘టెక్నో-కల్చరల్ ఫెస్ట్’

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ప్రతి సంవత్సరం నిర్వహించే టెక్నో-కల్చరల్ ఫెస్ట్ సుధీ, శ్రుతి-2025 బ్రోచర్‌ను శనివారం ప్రిన్సిపాల్ సి.వి.నరసింహులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ డైనమిక్ ఈవెంట్ మార్చి 4 నుంచి 8వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఇందులో సాంకేతిక నైపుణ్యం, సాంస్కృతిక చైతన్యాలతో అసాధారణ సమ్మేళనాన్ని విద్యార్థులు ప్రదర్శిస్తారన్నారు. విద్యార్థులు వారి ప్రతిభ, ఆవిష్కరణలు, సృజనాత్మకతను ప్రదర్శించటానికి వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు స్పాన్సర్ సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు సుశాంత్‌బాబు, ఎస్.వి.శ్రీనివాసులు, డాక్టర్ డి.ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, బి.లింగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీదేవి, టి.పూర్ణ చంద్రిక, వై.రమాదేవి, జి.సురేష్‌బాబు, డాక్టర్ ఎస్.ఎల్.ఎస్.రెడ్డి, పి.వి.రవీంద్రారెడ్డి, డాక్టర్ జి.ఎస్.ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ప్రజావసరాల మేరకే అభివృద్ధి

బండ్లగూడ: ప్రజలకు అవసరమైన మేరకు పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ అన్నారు. పద్మశ్రీహిల్స్, రాధానగర్, కేకేనగర్ తిరుమల గార్డెన్ కాలనీలో రూ. 7 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆమె శనివారం పర్యవేక్షించారు. అలాగే రూ. 5 లక్షల వ్యయంతో రాధానగర్ కాలనీలో ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయడంతోపాటు కొత్తగా రోడ్లను కూడా నిర్మిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు.


రాధానగర్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావతి

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనకు అభివృద్ధి పనులను చేపడుతున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ మాలతీనాగరాజు అన్నారు. వెస్టెండ్ కాలనీ పార్క్, హిమగిరినగర్, చంద్రయ్య కాలనీలలో మొత్తం రూ. 69 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సత్వరమే పూర్తి చేయాలన్నారు. గోతులమయంగా మారిన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లను వేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తున్నామన్నారు. స్థానిక నేతలు శాంతికుమార్, నర్సింగ్‌సింగ్, నథానియల్ భువనేశ్వరి, పద్మావతి, సుధాకర్, కృష్ణన్‌రాజు, భీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులకు ప్రారభిస్తున్న కార్పొరేటర్ మాలతి

చర్మ సౌందర్యానికి పెరుగుతున్న ప్రాధాన్యం

మణికొండ: మణికొండ-షేక్‌పేట రోడ్డులో ఏర్పాటు చేసిన వెర్నాన్ స్కిన్ క్లినిక్‌ను సినీ నటి, యాంకర్ సుమ కనకాల, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ రజత్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చర్మ సౌందర్యానికి మహిళలతో పాటు పురుషులు పెద పీట వేస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా అనేక సంస్థలు తమ క్లినిక్‌లను ప్రారంభిస్తున్నాయన్నారు. వాటిలో ఇలాంటి ఉత్తమ సంస్థలనే ఎన్నుకుని తమ చర్మ సౌందర్యాన్ని పెంచుకోవాలన్నారు. నిపుణులైన డెర్మటాలజిస్టులతో కూడిన టీం అత్యుత్తమ సేవలు అందిస్తుందని సుమ పేర్కొన్నారు.


క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రజత్‌కుమార్, సుమ తదితరులు

ఫంక్షన్‌హాల్ నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలి

మణికొండ: మంచిరేవులలో రూ. 4.50 కోట్ల మున్సిపల్ నిధులతో చేపట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆమె మున్సిపల్ డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్‌లతో కలిసి ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఫంక్షన్ హాల్‌లో ఫ్లోరింగ్, బాత్ రూంల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుందన్నారు.


ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

అగ్నిప్రమాదంలో ఏడీఎంఎస్ షోరూమ్ బుగ్గి

- 21 ఈవీలు.. 10 బ్యాటరీలు ఆహుతి
- రూ. 40 లక్షల మేర ఆస్తినష్టం

రాజేంద్రనగర్: విద్యుత్ బైక్‌ల షోరూమ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ పోలీసులు, బాధితుల సమాచారం మేరకు... అత్తాపూర్ ప్రాంతానికి చెందిన రవీందర్, జియాగూడ ప్రాంతానికి చెందిన నర్సింహులు 18 నెలల క్రితం నలందానగర్ ప్రధాన రహదారిపై కార్ ఎంటర్‌ప్రైజెస్ ఏడీఎంఎస్ ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ షోరూమ్ ఉంది. శనివారం ఉదయం 10 గంటలకు మేనేజర్ కిరణ్ మరో సిబ్బందితో కలిసి షాపును ఓపెన్ చేశారు. అప్పటికే దట్టమైన మంటలు అలుముకున్నాయి. షోరూమ్‌లో ఉన్న బ్యాటరీలు పేలుతుండటంతో ఎవరూ లోపలికి వెళ్లేందుకు సాహసించలేదు. నిమిషాల వ్యవధిలో షోరూమ్ మొత్తం మంటలు వ్యాపించాయి. లంగర్‌హౌస్, రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్‌ల నుంచి వచ్చిన రెండు ఫైరింజన్లు మంటలను అదుపుచేశాయి. ఈ సంఘటనలో 21 బైక్‌లు, 10 బ్యాటరీలు కాలిపోయినట్లు యజమానులు వెల్లడించారు. దాదాపు రూ. 40 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


షోరూం నుంచి వస్తున్న పొగ

నల్ల బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

రాజేంద్రనగర్: టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి నిధులు, సబ్సిడీలను ఆర్టీసీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో కార్మికులు శనివారం నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ), స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌ల డిపో కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్.కృష్ణ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభాలను గ్యారంటీ చేసేందుకు ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నదన్నారు. ఆర్టీసీనే వాటిని సమకూర్చుకునే వెసులుబాటును కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల పథకంలో మార్పులు చేయాలని, ఆర్టీసీలే నేరుగా విద్యుత్ బస్సులు కొని నడిపేలా విధానంలో సవరణ చేసి నిధులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీ ఇన్సెంటివ్‌లను ఆర్టీసీలకు ఇవ్వాలన్నారు. ప్రైవేటు విద్యుత్ బస్సులు రావడంతో అనేక మంది డ్రైవర్లు, మెకానిక్‌లు మిగులుగా తేలుతారని వారి విధులు ప్రశ్నార్థకంలో పడతాయన్నారు. ప్రజల అవసరాల మేరకు బస్సులు పెంచాలని, ఎంవీ యాక్ట్ 2019లో సవరణలు చేయాలన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఎయిర్‌పోర్టులో క్యాబ్ డ్రైవర్ల ధర్నా

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ప్రైవేటు క్యాబ్ డ్రైవర్లు శనివారం ధర్నాకు దిగారు. విమానాశ్రయంలోని అరైవల్, డిపార్చర్ టెర్మినల్ వద్దకు ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలు అనుమతించక పోవడంతో వాహన యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అనుమతించిన అధికారులు ప్రస్తుతం తమను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఎలాంటి అనుమతులు లేని వాహనాల్లో ప్రయాణికుల రాకపోకలను నిర్వహించడం నిబంధనలకు వ్యతిరేకమన్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదవుతాయని స్పష్టం చేశారు.